# మరువలేని మేలు

— అరిగె రామారావు

"ఇతనే సార్ త్రాగివచ్చి ఆఫీసులో నానా గొడవ చేస్తూంది" అని మా సెక్షన్ ఆఫీసరు అన్నాడు.

"ఇతను మన ఆఫీసు క్లర్కా?"

నేనీ ఆఫీసుకు క్రొత్తగా వచ్చాను. యెవరెవరో కూడా తెలియదు.

"క్లర్కు కాదు సార్! మన పి. డి. సెక్షన్లో లేడీక్లర్కు భర్త. ఉత్తత్రాగుబోతు. త్రాగుడుకు డబ్బులు కావల్సినప్పుడల్లా ఇలా ఆఫీసుకొచ్చి పాపం ఆమెను యిలా యాగీచేసి డబ్బులు గుంజుకుపోతాడు—" అన్నాడు మా ఎస్సో.

తనను త్రాగుబోతు అనేసిరికి అతను 'హుం' అని హుంకరించాడు. శరీరం స్వాధీనంలో లేక తూలుతున్నాడు. మా సెక్యూరిటీ గారు గట్టిగా అతని రెక్క పట్టుకొని వుండకపోతే ఎప్పుడో క్రింద పడివుండేవాడు.

మళ్ళీ యిలా యింకోసారి ఆఫీసుకొచ్చి గొడవచేస్తే పోలీసుల కప్పగిస్తానని అతన్ని బెదిరించి పంపించేశాను.

అతడ్ని ఎక్కడో చూసిన గుర్తు—లీలగా మనస్సులో పాతజ్ఞాపకాల మరుగున కదులుతూంది....

"ఆ లేడీక్లర్కును ఒకసారి పిలిపించండి" అన్నాను. మా ఎస్సో ఆమెను పిలవటానికి సెక్షన్లోకి వెళ్ళాడు.

....అతడ్ని ఎక్కడ చూచివుంటాను.... పేపర్ వెయిట్‌ను చేత్తో గిర్‌మని త్రిప్పుతున్నాను—యేదో ఆలోచిస్తూ. అప్రయత్నంగా దానిలాగే నా ఆలోచనలు తిరుగుతున్నాయి. గతస్మృతుల పరిధుల్లో....పదహారు సంవత్సరాల వెనక్కి.

అవును అతనే!

ర ర ర

—అప్పట్లో నాకు పన్నెండేళ్ళుంటాయో-పదమూడేళ్ళుంటాయో! మేం అప్పట్లో నూజివీడులో వుండేవాళ్ళం.

నూజివీడు హైస్కూల్లో తొమ్మిదోక్లాసు పరీక్ష వ్రాశాను.

అవి వేశవికాలం శలవులు.

ఒకరోజు మధ్యాహ్నంపూట నేనూ నా స్నేహితుడు దత్తూ లైబ్రరీకి బయలుదేరాం.

రోడ్డుమీద మా ముందు నడుస్తూన్న ఒకామెను చూపించి దత్తూ, "అదిగోరా ఆ ముందు వెళుతున్నామెను చూడు!" అన్నాడు.

చూశాను. వెనుకనుంచి ఏం కనిపిస్తుంది? లయబద్ధంగా కదులుతున్న పిరుదల మీద వయ్యారంగా నాట్యం చేస్తూన్న పెద్ద వాలుజడ నా చూపులను ఆకట్టుకుంది.

"ఈమె మా బాబాయి వాళ్ళింట్లో క్రొత్తగా అద్దెకు దిగింది. బిడివో ఆఫీసులో పని చేస్తుందట!" దత్తు చెప్పుతున్నాడు....నేను మాత్రం తమాషాగా అటూ యిటూ కదులుతున్న ఆ జడవంకే చూస్తోన్నాను. ఆ యువతి వయ్యారపు నడకా, ఆ అందాల వాలుజడా నా మనస్సులో ఒక సుందర దృశ్యంగా మెల్లమెల్లగా రూపుదిద్దుకుంటూంది....నాకా వయస్సుకే ఆడవాళ్ళల్లో పట్టిచూపే అందాలను వెతకటం అలవాటయింది—ఆడవాళ్ళనే కాదు అందమైనదేదయినా సరే! పసిపాపల బోసినవ్వూ, ఆకాశపు గుండె లోతులోకి ఎగిరే వంటరి పిట్టా చెట్టుకంతకీ పూసిన ఒకేఒక పువ్వూ, చెరువులో లేచే బుల్లిబుల్లి అలలూ, గుడిమెట్లమీద వెన్నెలా—యిలా అందమైనదేదయినా ఒక సుందరదృశ్యంగా మనస్సు పొరల్లో, తెరల్లో నిలచిపోతుండేది. ఏకాంతంలో ఆ సుందర దృశ్యాలను మననం చేసుకోవటం నా నైజంగా మారుతూన్న రోజులవి! నాలో 'ఇన్‌సైట్' పెరుగుతున్న దురదృష్టపు రోజులవి! 'దురదృష్టం' అని ఎందుకన్నానంటే ఈ 'ఇన్‌సైట్' వున్న ఏ వెధవాయి సుఖంగా తిని, హాయిగా నిద్రపోలేడు. తనకే తెలయని ఒక 'తపన' అంతులేని అశాంతీన్నూ!

ఈ తపన నాకా వయస్సుకే ఆ లేతమనస్సుకే పట్టుకుంది!

సరే, కథలోకి వద్దాం—ఆమె రాజాగారి సత్రం ప్రక్కన క్రొత్తగా పెట్టిన బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసులోకి వెళ్ళింది.

దత్తు గర్వంగా నా వంక చూస్తూ, "నేను చెప్పలా బిడివో ఆఫీసులో పనిచేస్తూందని—" అన్నాడు.




వాడి గర్వం వాడిది; నా ఆలోచనలు నావి! అల్లనల్లన కదిలే ఆ జడనుబట్టి ఆమె రూపురేఖలు ఎలా వుంటాయో వూహిస్తున్నాను.

"ఇక్కడ ఒక్కతే వుంటుంది. వాళ్ళ అమ్మానాన్నవాళ్ళు వాళ్ళ వూళ్ళోనే వుంటున్నారంట—"

నేనప్పుడే ఈ లోకంలోకి వచ్చినట్లు,

"ఎవర్ని గూర్చి చెప్పుతుంటా?" అన్నాను.

పాపం వాడికి వళ్ళు మండింది. "ఏదో పెద్ద కవికుమార్‌లాగా పోజుపెట్టకు. నేను చెప్పుతుంది, మా బాబాయి వాళ్ళింట్లో అద్దెకుంటున్నామె గురించి" వుడుక్కుంటూ అన్నాడు.

ఎప్పుడూ యేదో పోగొట్టుకున్నట్లు వెర్రి చూపులుచూసే నాకు, నా స్నేహితులంతా 'కవి కుమార్' అని పేరుపెట్టారు. ఆ పేరు సార్ధకం చేస్తూ నేను మా స్కూలు వ్రాతపత్రికలో రెండు మూడు గేయాలు కూడా వ్రాశాను.

దత్తు అన్నదానికి నేను "ఆమె జడ బాగుంది కదూ!" అన్నాను. దానికి వాడు నా వంక వింతగా చూశాడు.

ఇంతలో లైబ్రరీ వచ్చింది. దత్తు 'చందమామ' మీద పడ్డాడు. నేను పుస్తకాలు మార్పించటానికి లోపలికెళ్ళాను.

పుస్తకాలిచ్చే పంతులు, "ఏంవయ్యా, నీవు రోజూ నాగా లేకుండా యిలా పుస్తకాలు తీసుకెళ్ళుతావు. ఎవరు చదువుతారు?" అన్నాడు.

"నేనే!" కించిత్ గర్వంతో అన్నాను.

"నీవా?" ఆశ్చర్యంతో తెరచిన నోరు మూయటం కూడ మర్చిపోయాడు. మరి నేను చదివే పుస్తకాలు అలాంటివి — 'చలం', శరత్, కొడవటిగంటి, గనికొండాన్నూ! వూరికే చదవటమే కాదు—ఆయా స్త్రీ పాత్రలు నా మనస్సు గుడిలో దేవతావిగ్రహాలులాగా, అందమైన చక్కని వర్ణనలు నిశ్చలంగా వెలిగే గూటి దీపాలులాగా నిలిచిపోయేవి. ఆ వ్రాతలు నా మనస్సుకు అలా ఎక్కేవన్న మాట!

మళ్ళీ మర్నాడనుకుంటా, బజార్లో మా కెదురుగా వస్తోన్నామెను చూపించి, "అది గదిగో మా బాబాయిగారింట్లో అద్దెకుండే ఆమె!" అన్నాడు.

ముందురోజు వెనుకనించీ, మలిరోజు ముందునుంచీ చూశాను. ఆమె అందాన్ని ఆ జడను చూసి నేనూహించిన కళ్ళు నేనూహించినట్లే కార్తీకదీపాలలాగా వున్నాయి!

ఆ తర్వాత ఆమెని చాలాసార్లు చూశాను. దాదాపు రోజూ చూసేవాడ్ని. ఎందుకంటే దత్తు వాళ్ళ బాబాయి వాళ్ళ యిల్లు మా యింటి ప్రక్క సందులోనే వుండేది. ఆమె ఆఫీసుకు పోవాలన్నా రావాలన్నా మా యింటి ముందు నుంచే దారి మరి.

ఒకరోజు వుదయం దత్తు హడావుడిగా మా యింటికి వచ్చి, "రాత్రి ఐతే జరిగిందిరా, రామూ!" అన్నాడు.

నేను ఏమని అడిగే లోపలే "ఆ దమయంతి లేదూ...." అని ఏదో చెప్పబోయాడు. దమయంతి ఎవరంటూ నేను అడ్డుపడ్డాను.

"అబ్బ ఆమేరా, మా బాబాయి వాళ్ళింట్లో అద్దెకుంటుందని చెప్పలా—నీవు 'వాలు జడా-వాలు కళ్ళూ!' అంటావే ఆమె."

"అయితే ఆమె పేరు దమయంతా? ఆమె అందానికి అలాటి పేరే వుండాలి."

"దమయంతి యింట్లో రాత్రి పెద్ద గొడవ జరిగింది. మా సందులో త్రాగుబోతు వెధవ 'రౌడీరజాక్-బస్తీమే సవాల్' గాడు లేడూ? వాడు బాగా త్రాగివచ్చి ఆమె తలుపు కొట్టి మీద మీదకెళ్ళి బలాత్కారం చేయబోయాడంట! ఆమె ఏడుస్తూ మా బాబాయి వాళ్ళింట్లోకి పనుగత్తికెళ్ళి దాక్కుంది."

"చూశావా నీకెలాటి న్యూస్ చెప్పానో!" అన్నట్లు వెధవ పోజు పెట్టాడు మా దత్తుగాడు. అది విని నేను మాత్రం చాలా బాధపడిపోయాను. ఆ రౌడీరజాక్‌గాడి మీసాలకు నిప్పు పెట్టుదామన్నంత కోపం వచ్చింది....


మరురోజు ఆమెకు వుద్యోగ మిప్పించిన ఆఫీసరు దమయంతి యింటికి వచ్చి వెకిలి వేషాలు వేయటం మొదలుపెట్టేడంట.

ఈ విషయాలన్నీ దత్తు చెవుతుండేవాడు. కూపీలు లాగటంలో 'డికి వాడే సాటి.

గల్లీలోని అల్లరి రౌడీ అంటే సరే మరి, ఈ ఆఫీసర్లకు ఎలా బుద్ధి వుండదో! అందమైన ఆడదాన్ని చూస్తే బజారు కుక్కలకన్నా హీనం!

ఆ రోజు ఆదివారమనుకుంటాను. మా అమ్మ నన్ను మార్కెట్‌కెళ్ళి కూర తీసుకు రమ్మంది. తోడుగా వెంట దత్తును తీసికొని బయలుదేరాను. మార్కెట్‌కు వెళ్ళాలంటే






దమయంతి వాళ్ళ యింటి ముందునుంచే వెళ్ళాలి. లోపల్నుంచి కేకలు వినిపిస్తోన్నాయి. ఎవరిదో మొగ గొంతు వినిపిస్తోంది. దమయంతికూడ బిగ్గరగా మాట్లాడుతూంది. ఏదో వాదులాటలాగుంది.

దత్తూ నేనూ రోడ్డుమీద నిలబడిపోయాం. ఇంతలో ఒక యువకుడు లోపల్నుంచి సీరియస్‌గా, రేష్‌గా వచ్చి గుమ్మం ముందు నిలబడ్డాడు. కోపంగానే సిగరెట్ వెలిగించాడు. ఇంటి ముందు నిల్చొని చోద్యం చూస్తూన్న మమ్మల్ని చూసి, "మీ కిక్కడేం పని పోండి" అని ఒక్క గదుము గదిమేడు.

ఆ సాయింత్రం దత్తు వచ్చి చెప్పాక తెలిసింది—అతడు ఆమెకు అన్నయ్య తని. వుద్యోగం సద్యోగంలేని జులాయిగాడంట. త్రాగుబోతంట. ఆమె దగ్గర డబ్బులు గుంజుకుపోవడానికి వచ్చాడంట. ఉబ్బసం రోగంతో తీసుకునే తల్లీ, బ్రాకెట్లాడే తండ్రీ, 'పెద్ద మనుషు' లయిన, అవుతూన్న చెల్లెళ్ళూ, చదువుకుంటూన్న తమ్ముళ్ళూ — వీళ్ళంతా ఆమె మీద ఆధారపడ్డవాళ్ళే. వీళ్ళందరి పోషణా బాధ్యత తనదే! వీళ్ళకోసమే తను వుద్యోగం చేస్తూంది.

ఈ సంగతులన్నీ వాళ్ళ పిన్నికి ఆమె చెప్పుతూంటే మా దత్తుగాడు విన్నాడు.

ఆ సమాచారం వినేసరికి నా గుండెల్లో తడి అయింది. 'అయ్యో! నీకెన్ని కష్టాలు దమయంతీ!' అనుకున్నాను. ఆ రోజంతా ఇదే మాట నా మనస్సులో రింగ్ అవుతూంది.... ఆ సాయింత్రం వంటరిగా మా డాబా మీద కూర్చున్నామ. నా వూహాలోకాల్లో దమయంతి జాలిగా, బేలగా, శోకదేవతలాగా.... అయ్యో, దమయంతికి అన్యాయం జరిగిపోతూంది. దీన్ని ఆపటం ఎలా? అసలు ఆమె గురించి నాకీ తపన ఎందుకు? నేనామెను ప్రేమిస్తున్నానా? అసలు ప్రేమ అంటే ఏమిటి? నాకే నవ్వొచ్చింది....మరి, మరి ఈ మధనం ఏమిటి? ఈ చిత్రహింస ఏమిటి? నాలో ఏదో 'అర్జ్' నన్ను గట్టిగా వూపేస్తూంది....

క్రిందకు పరుగెత్తుకుంటూ వెళ్ళి నాలుగు తెల్ల కాగితాలు తెచ్చాను. వ్రాయటం మొదలు పెట్టేను....

వ్రాస్తూన్నాను — వ్రాస్తూన్నాను — వ్రాసి వ్రాసి అదొక సుదీర్ఘలేఖ అయింది. నా భావాల పల్లకీ అయింది, నాలో సుళ్ళు తిరిగే బాధకు అది అద్దమే అయింది.

అందులో ఏమి వ్రాశానో ఇప్పుడు ఇక్కడ ఏకరువు పెట్టలేను. నాకిప్పుడు పూర్తిగా గుర్తు లేదు కూడ. నాకు గుర్తున్నదల్లా ఆమెకు నేను వేసిన కొన్ని సూటి ప్రశ్నలు.... పండు వెన్నెలలు పండించుకోవల్సిన నీ బ్రతుకులో ఎందుకు కారు చీకట్లను కోరి తెచ్చుకుంటావు? అపూర్వమయిన నీ అందాన్ని, యౌవనాన్నీ ఎందుకిలా అడవి గాచిన వెన్నెల చేసుకుంటావు? నీ వాళ్ళకోసం నీ అందం నీ యౌవనమూ ఆగవు. వాళ్ళకు రెక్కలు రాగానే ఎగిరిపోతారు. అప్పటికి నీ రెక్కల్లో సత్తువ సన్నగిల్లిపోతుంది. వాళ్ళదాక ఎందుకు? రెక్కలొచ్చిన నీ అన్నయ్యే పట్టీపట్టకుండా, తన సుఖం తను చూసుకుంటున్నాడు. వీళ్ళూ అంతే! వీళ్ళ కోసం నీ కోర్కెలను చంపుకుంటావా? నీ గుండెల్నే వాటికి సమాధులు చేస్తావా? నీకు మాత్రం పెళ్ళి చేసుకోవాలనీ, ఒక యింటిదానివి కావాలనీ, పిల్ల పాపలతో చక్కగా సంసారం చేసుకోవాలనీ వుండదా? నీకొక మగదిక్కు లేదనేగా ఆ రౌడీవెధవా, మీ ఆఫీసరూ నీమీద అత్యాచారం చేయబోయారు....

—ఇలా సాగిందా వుత్తరం. దాన్ని ఆ రాత్రి జాగ్రత్తగా దాచిపెట్టాను.

మర్నాడు సాయంత్రం మా వూరి బయట వున్న కోనేటి గట్టుకేసి వెళ్ళాను. గట్టుమీద ఆంజనేయస్వామి విగ్రహం వుంది. దాని ప్రక్కనే ఒక జువ్వి చెట్టు వుంది. ఆ చెట్టు క్రింద కూర్చుని ఆ వుత్తరాన్ని మళ్ళీ చదివేను. దీన్ని నేనే వ్రాశానా అనిపించింది. అంత చక్కగా వచ్చింది. సొగసయిన భాషతో, గుండె లోతులను తడిమేటట్లుగా వుంది. దమయంతే గనుక దీన్ని చదివితే తన జీవితంలో తనేం పోగొట్టుకుంటోందో తెలిసి వస్తుంది; గుండెలవిసిపోయేటట్లు ఏడుస్తుంది.

అంతా బాగానే వచ్చింది. మరి దీన్ని ఏం చెయ్యాలి? చించివేయడానికి మనస్సు వప్పలేదు. దీన్ని ఎలాగయినా ఆమె కందజేస్తే— ఎలా? మెరుపులాగా ఒక ఆలోచన వచ్చింది. వెంటనే దాన్ని ఆచరణలో పెట్టాలనుకున్నాను.

కాని, ఆమె ఈ వుత్తరం చదివిందో లేదో ఆమె మీద పని చేసిందో లేదో ఎలా నాకు తెలుస్తుంది? అందుకొక 'టెస్టు' పెట్టాలనుకున్నా. అందుకే దాన్ని ఇలా పూర్తిచేశాను.

....వచ్చే శనివారం సాయంత్రం ఆరు గంటలకు కోనేటి గట్టుమీద వున్న ఆంజనేయస్వామి విగ్రహం దగ్గరకొస్తే నీ సమస్యలకొక పరిష్కారం, నీ జీవితానికొక తోడూ దొరుకుతుంది; నీ గుండెల్లో పూలు పూస్తాయి; నీ బ్రతుకు బాటలో వెన్నెలలు కాస్తాయి.

ఉత్తరాన్ని జేబులో పెట్టుకొని మెల్లగా వూళ్ళోకి బయలుదేరాను. అప్పటికే దీపాలు వెలిగాయి.

నేరుగా దమయంతి యింటివయిపు బయలుదేరాను. ఆ మసీదు సందు బిక్కు బిక్కుమంటోంది. రెండు మూడు సార్లు ఆ సందులో అటూ ఇటూ తిరిగేను. కిటికీ తలుపులు తెరిచి వున్నాయి. క్రీనీడలో నక్కి కాళ్ళు పైకెత్తి లోపలికి తొంగిచూశాను. లోపల వంట చేసుకుంటున్నట్లుంది. ముందు గదిలో అలికిడిలేదు. అటూ ఇటూ చూచి మెల్లగా కిటికీగుండా లోపలికి విసిరేశాను. ఆ వుత్తరం నేరుగా ఆమె మంచం మీద పడింది. అంతే, ఆ సందులోంచి ఒక్కటే పరుగు తీశాను....


అయ్యో, మనవి చేస్తున్నాను అప్పుడు నా వయస్సు పన్నెండో పదమూడో!

—ఎంతో ఎదురు చూసిన శనివారం సాయింత్రం రానే వచ్చింది. చలం నవల ఏదో చేత్తో పట్టుకుని అయిదు గంటలకే చెరువు గట్టుకేసి చేరుకున్నాను.

పగలల్లా మిడిసిపడ్డ ప్రొద్దు జారిపోతూ వుంటే ఆ సాయింత్రం అందాలు దిద్దుకుంటూ వుంది.

గట్టు దిగువ ఇటుక బట్టీల దగ్గర కూర్చున్నాను. ఇదీ అని చెప్పలేని భావోద్వేగంతో కొట్టుమిట్టాడుతూ మాటి మాటికీ గట్టుకేసి






చూస్తున్నాను.

ఒకదాని కొకటి పొంతనలేని ఆలోచనలు! నిజంగా ఆమె వస్తుందా? ఎవరో పోకిరీ వెధవ ఏదో వ్రాశాడులే అని తీసిపారేస్తుందా? ఒకవేళ ఆమె వస్తే ఆమెతో మాట్లాడాలా? అమ్మో! మరెందుకీ పడిగాపులు? నా భాషకూ, భావాలకీ ఇదొక పరీక్ష! ఆమెను ఎలా ఇన్‌ఫ్లుయెన్స్ చేశాయో తెల్సుకోవటం కోసమే! అంతే, మరింకేమీ లేదనుకున్నాను.

అయ్యో, మర్చిపోవద్దు మళ్ళీ చెపుతున్నాను అప్పుడు నా వయస్సు పన్నెండో పదమూడో!

తల త్రిప్పి అటు చూశాను కదా! దమయంతి నిజంగానే వచ్చింది. లేత నీలం జార్జెట్ సిల్కు చీర కట్టి మబ్బుల్లోంచి దిగి వచ్చిన దేవ కన్యలాగా.

నాలో వణుకూ ఏదో ఎక్సైట్‌మెంటున్నూ! ఆమె నా వయిపు చూడగానే తల వంచుకొని పుస్తకం చదువుతున్నట్లు ప్రిటెండ్ చేశాను.

ఆమె అలవోకగా జడ ముందుకు లాక్కొని కొసలు అల్లుకుంటూ జువ్విచెట్టు కానుకొని నిలబడింది. మధ్య మధ్యలో టైం చూసుకుంటూ ఎదురు తెన్నులు చూస్తోంది.

నా గుండెల్లో గర్వంతో కూడిన పొంగు!

ఏ చెట్టుమీద ఏకొమ్మ మాటున కూర్చుందో గాని ఒక కోయిల ఆగకుండా గొంతెత్తి అందంగా కూస్తోంది.

ఆమె విసుగ్గా జడను వెనక్కి విసురుకొని వెళ్ళిపోవడానికి వుద్యుక్తురాలవుతుండగా ఒక వ్యక్తి అటుకేసి వచ్చాడు. ఆమెవంక వింతగా ఆశ్చర్యంగా చూచి చిరునగవుతో, జోడించిన చేతులతో ఆమెను పలకరించాడు.

అతను మావూరతనే. పేరుమోసిన చెడుగుడు ఆటగాడు. పేరు దయానిధి. షోకిల్లాగా తిరుగుతుంటాడు.

వాళ్ళిద్దరూ ఏదో మాటాడుకుంటున్నారు. ఇక్కడ్నుంచి నేను ఇదంతా గమనిస్తూనే వున్నాను.

మలి సంజలు చీకట్లుగా మారుతుండగా వాళ్ళు మెల్లగా గట్టు దిగి అలా మాట్లాడుకుంటూ వూరివయిపు బయలుదేరారు.

నేనూ మెల్లగా లేచాను.

మర్నాడు సాయంత్రం నేనూ, దత్తూ కోనేటి గట్టుకేసి వెళ్ళాం. అప్పటికే ఆ దయానిధీ, ఈ దమయంతీ జువ్విచెట్టుక్రింద కూచుని నవ్వుతూ ఏదో మాట్లాడుకుంటున్నారు.

ఆ మర్నాడనుకుంటా మా అమ్మతో కలసి నేను గుంటూరు పెళ్ళికి వెళ్ళాను. మళ్ళీ తిరిగి వచ్చేసరికి పదిహేను రోజులు దాటింది.

దత్తు వచ్చి, "అరేయ్ కవి కుమార్! 'నీ వాలుజడా—వాలు కళ్ళూ' యిల్లు ఖాళీచేసి వెళ్ళిపోయిందిరా!" అన్నాడు.

నెల్లూరు దగ్గర వున్న ఏదో వూరికి కావాలని ట్రాన్స్‌ఫరు చేయించుకుందట. ఇంట్లో వాళ్ళెవరికీ తన ఆచూకీ కూడా తెలియనీయలేదంట. మొన్నీమధ్య వాళ్ళ నాన్న వచ్చి ఆఫీసులో వాకబు చేసేవరకు ఆమె ట్రాన్స్‌ఫరు సంగతి వాళ్ళకు తెలియదంట. పాపం ఆ ముసలాయన లబో దిబోమని మొత్తుకొని పోయాడని దత్తు చెప్పాడు.

అంతే, ఆ తర్వాత దమయంతి ఏమయిందో కూడా నాకు తెలియదు. ఆమె సంగతి పూర్తిగా మర్చిపోయాను కూడ. కాని, చాల రోజులవరకు నాకు గుర్తున్నదల్లా నేను రాసిన ఆ వుత్తరం గురించే.

$\ast$ $\ast$ $\ast$

మా ఎస్వో ఆ లేడీక్లర్కును వెంటబెట్టుకుని వచ్చాడు.

ఆమెను చూచి అదిరిపడ్డాను.

ఆ సూటి ముక్కూ, ఆ పెద్ద కళ్ళూ - పాపట్లోంచి నెరుస్తూన్న జుట్టూ, శరీరంమీద వయసు చేసిన 'దాడి'....ఓ మైగాడ్, ఈమె ఎవరో కాదు....అనాటి దమయంతే!

నాలో చెలరేగే భావాలను ఏమని చెప్పను? ఎలాగో నా ఎక్సైట్‌మెంట్‌ను అణచుకుంటూ ఆమెకు సీట్ ఆఫర్ చేశా.

మా ముసలి ఎస్వో చెప్పుతున్నాడు—"పాపం, దమయంతమ్మ చాల మంచిది సార్! ఈ త్రాష్టుడూ, త్రాగుబోతూ ఎలా తారసపడ్డాడో గాని...."

"ఇతను చెడుగుడు ప్లేయర్ కదూ...." మాట నోరు జారింది.

ఆమె నా వంక ఆశ్చర్యంగా చూసింది. నేను సర్దుకున్నాను. "ఏ పేపర్లోనో ఫొటో చూసిన గుర్తు...."

"అవును అప్పుడు చెడుగుడు ప్లేయరే! ఇప్పుడు నా బ్రతుకుతో చెడుగుడు ఆడుతున్నాడు....ఇతని కోసమే నా మీదే ఆధారపడ్డ ముసలి తల్లిదండ్రులనూ, చెల్లెళ్ళనూ, తమ్ముళ్ళనూ అన్యాయంగా అర్థంతరంగా వదిలేశాను. దిక్కులేని పక్షులను చేశాను. వాళ్ళు చెట్టుకొకళ్ళు, పుట్టకొకళ్ళు అయ్యారు. ముసలితనంలో రోగాలకు మందులేక, ఆకలికి తిండిలేక అమ్మా నాన్నా చనిపోయారు. వయసులో వున్న చెల్లెళ్ళు తెగిన గాలిపటాలయ్యారు. పెద్దది పడుపు వృత్తిలోకి దిగింది. చిన్నది కాలు జారింది. మోసపోయి ఆత్మహత్య చేసుకుంది. తమ్ముళ్ళు గాలివెధవలయిపోయి ఎటెటో పోయారు...." కన్నీళ్ళు వత్తుకుంటూ తన గుండెల్లోని బాధంతా చెప్పింది.

"మరి మీ మీదే ఆధారపడ్డ మీ వాళ్ళను ఎందుకు వదిలేశారు?" వెధవ ప్రశ్న వేశాను.

"సుఖపడిపోదామని; జీవితంలోని ఆనందమంతా జుర్రుకుందామని...."

కొన్ని క్షణాలు మౌనంగా వున్నాక తనలో తాను గొణుక్కుంటున్నట్లుగా అంది:

"....అసలు ఆ పాడు వుత్తరం చేసింది.... నన్ను మైకంలోకి దించింది. ఇదిగో ఈ మహానుభావుడ్ని కలిపింది. నిశ్చింతగా బ్రతుకుతున్న నా బ్రతుకులో భూకంపాలను సృష్టించింది. నా వాళ్ళను నాకు కాకుండా చేసింది. చెట్టుకొకళ్ళు పుట్టకొకళ్ళ చేసింది...." పమిట చెంగుతో కళ్ళు తుడుచుకుంది.

కొన్ని క్షణాలు బరువుగా గడిచేక "సారీ సార్! అనవసరంగా మీ టైం వేస్టు అయింది" అని లేచి నిలబడింది.

"మీకు పిల్లలు...."

విరక్తిగా నవ్వింది.

"సార్, వీళ్ళ తమ్ముడికి మన ఆఫీసులో ప్యూను వుద్యోగం కోసం అప్లికేషన్ పెట్టుకుంది. మీరు దయతలచి...." మా ఎస్వో పాపం జాలిగుండె మనిషి.

"అందరూ మట్టికొట్టుకుపోగా ఆఖరువాడ్ని మాత్రం చేరదీశా. తమ్ముడయినా కొడుకయినా వీడే! రేపు నాకు కొరివి పెట్టేవాడూ వీడే! వాడికి మీరు వుద్యోగం యిప్పిస్తే మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను సార్!" అంది.

అవును. ఆమెకి నేను చేసిన మేలు ఈ జన్మలో మరిచిపోలేదు. □





# ఏక్సిడెంట్

'మురళీధర్'

ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం ఆడపెళ్ళివారిల్లులా సందడిగా కళకళలాడుతుంది. గుంటూరు-హైదరాబాద్ రూట్‌లో క్రొత్తగా ప్రవేశపెట్టబడిన తాతావారి 1210-ఇ సూపర్ ఎక్స్‌ప్రెస్ 'మైడెన్ రన్'కు సిద్ధంగా వుంది. ట్యూబ్ లైట్ల కాంతిలో, తెలుపు కాషాయ రంగులలో మెరిసిపోతున్న బస్సు, [illegible]త్త పెళ్ళికూతురు పెళ్లై అత్తవారింటికి [illegible]యలుదేరుతున్నట్టుంది. విండ్ స్క్రీన్స్‌కు ఆర్చీలుగా అలంకరణ చేసిన ఎరుపు, పసుపు, నీలం బల్బులు, నూతన వధువు మంగళసూత్రాలులా మెరుస్తున్నాయ్. పైసగం బ్లాక్ పెయింట్‌తో కవర్ చేసిన హెడ్‌లైట్లు, సిగ్గుతో క్రిందకు వాలిపోతున్న వధువు కనురెప్పలులా వున్నయ్. రెండు వైపులా చివరగా, ఆరుతూ, వెలుగుతున్న ట్రాఫిక్ ఇండికేటర్స్ మధ్యమధ్య క్రీగంట చూస్తున్న పెళ్ళికూతురు వాలుచూపులులా వున్నయ్. ప్రక్కల [illegible]నుకవైపు వున్న పిలి